క్లుప్తంగా

వరికూటిని కలిసిన పేర్లి నాని



రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్ బాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాని

చీరాల రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబును పార్టీ మాజీ ఎస్సీసెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పేర్లి నాని శుక్రవారం విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి.. రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఎంపికైన అశోక్‌బాబును అభినందించారు.

రిపబ్లిక్‌డే రోజు మాంసం దుకాణాలు బంద్

అద్దంకి రూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా ఆదివారం అద్దంకి మునిసిపాలిటీ పరిధిలోని అన్ని మాంసాహార విక్రయాలు నిషేధించినట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చికెన్, మటన్, చేపలు దుకాణ నిర్వాహకులు షాపులు మూసి వేయాలని తెలియజేశారు. అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోమని తెలియజేశారు.

సంఘాల అభివృద్ధి సాధ్యం

చీరాల టౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సక్రమంగా వినియోగించుకోవడంతో పాటు మొబైల్ బుక్ కీపింగ్‌ను నిర్వహించాలని వెలుగు ఏపీఎం మధుసూదనరావు సూచించారు. శుక్రవారం మండలంలోని బుర్ల వారిపాలెంలోని స్త్రీశక్తి భవనంలో వెలుగు పథకం మండల సమాఖ్య సభ్యులతో ఏపీఎం సమావేశాన్ని నిర్వహించారు. జీవనోపాధి పెంచేలా పొదుపు సంఘాల ఏపీఎంలు, అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మండల సమాఖ్య ప్రతినిధులు, వీఓఏలు పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యత సామాజిక బాధ్యత



వీఓఏల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ తదితరులు

ఇంకొల్లు(చినగంజాం): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయడాన్ని వీఓఏలు సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీఓ జి. శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వెలుగు (డీఆర్‌డీఏ) సమావేశ భవనంలో శుక్రవారం డిజిటల్ ఆర్థిక, క్రియాత్మక అక్షరాస్యతపై మండలంలోని వివిధ గ్రామాల వీఓఏలు.. వలంటర్లకు ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒక్కొక్కరు 10 మందిని అక్షరాస్యులుగా చేయాలన్నారు. వయోజన విద్య పర్యవేక్షకులు టి. పోతురాజు, ఏపీఎం పి. అనురాధ, ఐసీడీఎస్ సూపర్ వైజర్ కొల్లా వాణి, సీసీలు, అకౌంటెంట్ పాల్గొన్నారు.

బతుకు రోడ్డుపాలు

- సగం మాత్రమే సీసీ రోడ్డు.. మిగిలిన చోట కంకర పోసి వదిలేసిన వైనం
- కంకరపై నడవలేక తిప్పలు పడుతున్న జనం
- పట్టించుకోని దేశాయి పేట పంచాయతీ అధికారులు



సీసీ రోడ్డు వేయకుండా కంకర పోసి వదిలేసిన రోడ్డు

వేటపాలెం: కూటమి ప్రభుత్వంలో చెప్పింది చేయరనే మాటను అధికారులు నిజం చేస్తున్నారు. సగం రోడ్ల నిర్మాణంతోనే సరిపెడుతున్నారు. మిగిలిన రోడ్డు కంకర పోసి వదిలేస్తుండటంతో స్థానికులకు ఆ రోడ్డుపై నడవడం కష్టంగా మారింది. దేశాయిపేట పంచాయతీ పరిధిలో ఎన్ఆర్‌జీఎస్ నిధులతో తొమ్మిది సిమెంట్ రోడ్లు మంజూరు చేశారు. ఇందులో రామానగర్‌లో డీవీ సుబ్బారావు ఇంటి దగ్గరలో గల మట్టి రోడ్డును సిమెంట్ రోడ్డుగా వేయడానికి నిధులు మంజూరు చేశారు. అందులో భాగంగా పది రోజుల కిందట మట్టి రోడ్డుపై కంకర పోశారు. దానిపై సిమెంట్ రోడ్డు వేయాల్సి ఉండగా రెండు రోజుల క్రితం ఆ రోడ్డులో సగం వరకు సిమెంట్ రోడ్డు వేశారు. మిగిలిన సగం రోడ్డు కాంక్రీటు వేయకుండా అలాగే వదిలేశారు. దీనిపై కాంట్రాక్టర్‌ను స్థానికుల ప్రశ్నించగా తనకు అప్పగించిన రోడ్డుకు సంబంధించిన నిధులు సరిపడినంత వరకే రోడ్డు నిర్మాణం చేసినట్లు తెలిపాడు. గ్రామ పంచాయతీ అధికారులు కూడా ఆ తర్వాత రోడ్డు వేస్తామని తెలిపినట్లు సమాచారం. ఈ క్రమంలో రోడ్డుపై వేసిన కంకర రాళ్లలో నడవడం కష్టంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. ఉన్న మట్టి రోడ్డు సక్రమంగానే ఉండగా.. అనవసరంగా కంకర పోసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా మిగిలిన సగం రోడ్డును సిమెంట్ రోడ్డుగా మార్చి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేయాలని కోరుతున్నారు.

కంకర రోడ్డుపై నడవడం కష్టంగా ఉంది



కంకర రోడ్డు వేసి వదిలేశారు. బయటకు వెళ్లాలంటే కంకర రాళ్ల గుచ్చుకుంటున్నాయి. పది రోజుల నుంచి ఈ రాళ్లలోనే నడుస్తున్నాం. ఇప్పటికైనా రోడ్డు బాగు చేయండి.

– **విజయ**, రామానగర్, దేశాయిపేట

సగం రోడ్డు వేసి వదిలేశారు



ఉన్న రోడ్డులో సగం రోడ్డు సిమెంట్ రోడ్డు వేసి వదిలేశారు. మిగిలిన రోడ్డుకు నిధులు సరిపోలేదంట. పది రోజుల నాడు మొత్తం రోడ్డుపై కంకర పరిచారు. కంకర రోడ్డులో నడవాలంటే వృద్ధులు, పిల్లలు, వాహనాలు వెళ్లాలంటే కష్టంగా మారింది.

– **తిరుపాలు**, రామానగర్, దేశాయిపేట

మట్టి రోడ్డు ఉన్నప్పుడే బాగుంది



సిమెంట్ రోడ్డు వేస్తామని చెప్పి సగం రోడ్డు వేసి వదిలేశారు. ఇప్పుడు వేసిన కంకర రోడ్డులో నడవడం కంటే మట్టి రోడ్డుపై నడవడమే బాగుంది. కంకర రాళ్లకు కాళ్లు ఎక్కడ కోసుకు పోతాయని భయంగా ఉంది. అధికాలకు చెప్పినా పంటించు కోవడం లేదు. ఉన్నతాధికారులు కలగజేసుకొని రోడ్డు పూర్తి చేయాలి.

– **రాజమ్మ**, రామానగర్, దేశాయిపేట

గాదెను కలిసిన నాయకులు



గాదె మధూసూదనరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న పర్చూరు వైఎస్సార్ సీపీ నాయకులు

పర్చూరు (చినగంజాం): పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి తనయుడు గాదె మధు సూదన్‌రెడ్డిని పర్చూరు వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం కలిశారు. గుంటూరులోని స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. పంచాయతీరాజ్ మాజీ అధ్యక్షుడు, పర్చూరు మాజీ ఎంపీపీ, పార్టీ సీనియర్ నాయకులు కొల్లా వెంకట్రావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలెపోగు రాంబాబు, కారంచేడు మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, దగ్గుబాడు సర్పంచ్ గేరా రవీంద్రనాథ్ ఠాగూర్, మండల నాయకులు గాజుల రమేష్, మార్టూరు మండల నాయకులు బాబూ నాయక్ తదితరులు ఆయనను కలిసి వారిలో ఉన్నారు. నియోజక వర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు.

పశువుల వ్యాధి నివారణకు చర్యలు



ఆదిపూడిలో పశువైద్య శిబిరంలో గొర్రెలను పరిశీలిస్తున్న డాక్టర్ రమేష్

ఆదిపూడి (కారంచేడు): గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు వంటి పశువుల్లో వ్యాపించే వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పశుసంవర్థక సహాయ సంచాలకులు డాక్టర్ రమేష్ అన్నారు. శుక్రవారం ఆదిపూడిలో పశుసంవర్థక శాఖ, రిలయన్స్ ఫౌండేషన్‌ల సంయుక్త సహకారంతో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. కారంచేడు పశువైద్యాధికారి డాక్టర్ భాగ్యరాజ్ నేతృత్వంలో 40 గేదెలకు, 20 పాడి గేదెలకు, 30 గేదెలకు గర్భకోశవ్యాధులు, 25 దూడలకు, సుమారు 200కు పైగా గొర్రెలకు పరీక్షలు నిర్వహించి మందులను కూడా ఉచితంగా అందించారు. వాతారణంలో ఉన్న మార్పులతో ప్రస్తుతం పశువులకు అనేక రకాల అంటూ వ్యాధులు ప్రబలుతుంటాయన్నారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి పి. రత్నకుమార్, పశువైద్య సిబ్బంది, పశుపోషకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మార్టూరు: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయమై శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. మార్టూరులోని కిషోర్ కాలనీకి చెందిన గజ్జల శివ రంగయ్య (37)ఈనెల 19వ తేదీ పొలాల సమీపంలో మద్యంలో పురుగుమందు కలుపుకొని తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చీరాల అర్బన్: పట్టణంలోని దండుబాటలోని సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు డీఈఈ బి.హరిప్రసాదరావు శుక్రవారం తెలిపారు. వైకుంఠపురం, విఠల్‌నగర్, ఉజిలిపేట, జయంతిపేట, రోశయ్యకాలనీ, కారంచేడు రోడ్డు ప్రాంతాల్లో నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

వీధుల్లో చెత్త వేస్తే చర్యలు

చీరాల టౌన్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని ఈవోఆర్డీ రామకృష్ణ సూచించారు. శుక్రవారం తోటవారిపాలెం గ్రామ పంచాయతీలో చేపడుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను ఈవోఆర్డీ పరిశీలించారు. ఇంటి నుంచి వచ్చే చెత్తను కార్మికులకు అందించాలన్నారు. రోడ్డు మార్జిన్‌ల వద్ద చెత్తను సేకరించి అక్కడ బ్లీచింగ్ చల్లించారు.

వాహనం ఢీకొని.. ఇరువురికి గాయాలు



తిమ్మనపాలెం వద్ద గాయపడిన మహిళలను వైద్యశాలకు తరలిస్తున్న దృశ్యం

మేదరమెట్ల: రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతున్న ఇరువురు మహిళలను వెనుక నుంచి వచ్చిన తుఫాను వాహనం ఢీ కొన్న సంఘటన తిమ్మనపాలెం జాతీయరహదారిపై శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. కొరిశపాడు మండలం తిమ్మనపాలెం గ్రామానికి చెందిన చెరుకూరి భూలక్ష్మి, వల్లమూడి రమణ ఇరువురు మహిళలు రోడ్డు పక్కన నడుచుకుంటూ గ్రామంలోకి వెళ్ళే క్రమంలో మేదరమెట్ల వైపు నుంచి ఒంగోలు వైపుకు వెళుతున్న తుఫాన్ వాహనం ఇరువురినీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఇరువురు మహిళలకు గాయాలు కాగా 108 వాహనంలో వైద్యశాలకు తరలిచారు. మేదరమెట్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఏఓ కిరణ్ కుమార్‌కు వీడ్కోలు



అధికారుల సత్కారం అందుకుంటున్న ఏవోలు వీరగంధం కిరణ్ కుమార్, అంజిరెడ్డి

మార్టూరు: ఏ అధికారి అయినా ప్రభుత్వ పథకాలను నిష్పక్షపాతంగా ప్రజలకు చేర్చినప్పుడే ఆ అధికారి ప్రజల మన్ననలు చూరగొంటారని మార్టూరు ఏవో వీరగంధం కిరణ్ కుమార్ అందుకు అర్హుడని ఒంగోలు వ్యవసాయ శాఖ ఏడీఏ బి. ఎర్రాయిాం అన్నారు. మార్టూరు మండల వ్యవసాయ శాఖ అధికారిగా కిరణ్ కుమార్ 6 సంవత్సరాలు పనిచేసి బదిలీపై విజిలెన్స్ శాఖకు వెళుతున్న సందర్భంగా శుక్రవారం స్థానిక ఇంటూరి ఫంక్షన్ హాలులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఏవో కిరణ్ కుమార్‌ను, మార్టూరు ఏవోగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అంజిరెడ్డిలను వ్యవసాయ శాఖ అధికారులు సిబ్బంది ఘనంగా సత్కరించి సన్మానించారు. మార్టూరు, పర్చూరు, అద్దంకి ఏడీఏలు కేవీ శ్రీనివాసరావు, ఎన్. మోహన్రావు, ధనరాజు బాపట్ల, అద్దంకి, యద్దనపూడి, బల్లికురవ, సంతమాగులూరు, కొరిశపాడు, జె. పంగులూరు ఏవోలు అనిల్, కె. వెంకటకృష్ణ, మేరమ్మ, కుమారి, లావణ్య, శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

బాలికలను తీర్చిదిద్దాలి



కేజీబీవీలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ ఈవో

బల్లికురవ: డ్రాపౌట్స్ బాలికల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కస్తూర్బా గాంధీ గురుకుల బాలికల విద్యాలయాల్లో చదువుతున్న బాలికలను విద్యతో పాటు ఆట పాటల్లోనూ తీర్చిదిద్దాలని డిప్యూటీ డీఈవో అబ్బరాజు శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రావడంతో సంతృప్తి చెందారు. పరీక్షల సీజన్ ఆరంభమవుతున్నందున విద్యలో వెనుకబడిన బాలికలను గుర్తించి ప్రత్యేక తరగతులతో తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌ల ద్వారా విద్యాబోధన జరిగేలా చూడాలని ఉపాధ్యాయులనిలను ఆదేశించారు. ప్రిన్సిపాల్ కోనా సరళకుమారి పాల్గొన్నారు.

డ్రాపౌట్స్ విద్యార్థులను గుర్తించాలి



పాఠశాల రికార్డులు పరిశీలిస్తున్న నియోజకవర్గ ప్రత్యేకాధికారి

అద్దంకి రూరల్: డ్రాపౌట్స్ విద్యార్థులను ఉపాధ్యాయులు గుర్తించి వారిని మళ్లీ బడికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి బాలమ్మ అన్నారు. మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. విద్యార్థుల హాజరు పట్టీలను పరీక్షించి ఎక్కువ రోజులు పాఠశాలకు గైర్హాజరైన విద్యార్థుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంఈవో గంగాధర్, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ జలాలు వృథా



నిండుకుండలా ప్రవహిస్తున్న వెంపరాల మేజర్ కాలువ

బల్లికురవ: సకల ప్రాణికోటికి జీవనాధారమైన మంచినీరు వృథాగా వాగులు వంకలపాలవుతున్నాయి. సాగర్ అద్దంకి బ్రాంచ్ కాలువ నుంచి పసుమర్రు, గుంటుపల్లి, వెంపరాల, అద్దంకి, మేజర్ కాలువలతో పాటు మైనర్ కాలువల ద్వారా నెలరోజులుగా సాగర్ జలాలు వృథా అవుతున్నాతున్నాయని రైతులు తెలిపారు. వ్యవసాయంలో ఆటుపోటులతో పంటల సాగును ఖరీఫ్‌కే పరిమితం చేశారు. రబీలో మొక్కజొన్న, పప్పు శనగను తక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



వేటపాలెం: ఉపాధ్యాయినికి సన్మానం



కారంచేడు: ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్‌సీసీ బాలికా క్యాడెట్లు



బల్లికురవలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

వేటపాలెం: తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల చదువు విషయంలో లింగ వివక్ష చూపరాదని పట్టభద్రుల సంఘం అధ్యక్షుడు ప్రత్తి వెంకట సుబ్బారావు పేర్కొన్నారు. దేశాయిపేట పంచాయతీ లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పట్ట జాతీయ బాలికా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వెనుకబడిన ప్రాంతాల్లో ఉన్న బాలికల విద్యాభివృద్ధికి సంఘం కృషి చేస్తుందన్నారు. అనంతరం ఉపాధ్యాయురాలు నార్ని శివపార్వతిని ఘనంగా సన్మానించారు. సంఘ కార్యదర్శి సుంకర వెంకట లక్ష్మీ ప్రసాద్, ఉపాధ్యక్షుడు బుర్రా సాంబశివరావు, ఉపాధ్యాయులు మల్లేశ్వరి, రావి మస్తాన్ రెడ్డి, ప్రత్తి శరత్ బాబు, నాగం జనీయుడు, హరి, బుజ్జమ్మ, మల్లేశ్వరరావు, సునీత పాల్గొన్నారు.

కారంచేడు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ ఇంకొల్లు ప్రాజెక్టు సీడీపీఓ తిరుమలశెట్టి ఝాన్సీ అన్నారు. శుక్రవారం స్వర్ణ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన జాతీయ బాలికా దినోత్సవంలో మాట్లాడారు. బాలికలు చక్కగా చదువుకొని విద్యావంతులుగా మారి, ఈ చట్టాలు అమలు జరిగేలా కృషి చేయాలన్నారు. స్వర్ణ పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ హస్మప్రియ, హెచ్ఈఓ వి. నాగేశ్వరరావు, ఐసీడీఎస్ స్వర్ణ సెక్టార్ సూపర్‌వైజర్ సునీత పాల్గొన్నారు. అలాగే కారంచేడు యూపీలో కారంచేడు వైద్యాధికారి డాక్టర్ జి. సురేష్‌బాబు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, గుత్తా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బల్లికురవ: బాలికలు చదువుకుని అభివృద్ధి సాధించాలని ఎంపీడీఓ కుసుమ కుమారి కోరారు. జాతీయ బాలికాదినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఐసీడీఎస్ ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ రవి నాయక్, డీటీ ప్రహర్ష ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, వైద్యాధికారి రవితేజ, ఎంవీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ హరిహరరెడ్డి, సూపర్‌వైజర్ విజయనిర్మల, సలోమి మాట్లాడారు.

చినగంజాం: బాల్య వివాహాలు వద్దు అని.. చదువులు ఎంతో ముద్దు అని చినగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డి. రత్నకుమారి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం పురస్కరించుకొని అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ ఎన్. సుమలత, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎస్. సౌజన్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్టూరు: బాలికలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సూపర్‌వైజర్ కె. పద్మ అన్నారు. ద్రోణాదుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అవగాహన కల్పించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బేబీ, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మి నారాయణమ్మ, ఏఎన్ఎం మోహిని, మానస, హెచ్‌ఎం జంగా పోతురాజు పాల్గొన్నారు.

యద్దనపూడి: సూపర్‌వైజర్ సుజాత యద్దనపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సదస్సు నిర్వహించారు. ఏఎన్ఎంలు, ఆశాల , కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

చినగంజాం: బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె. కీర్తి సరోజ్ అన్నారు. సంతరావూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. హెచ్ఈఓ యు. వెంకటరమణ, హెచ్‌ఎం సత్యానందం, ఏఎన్ఎం శాంత కుమారి పాల్గొన్నారు.



సంతరావూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, వైద్య సిబ్బంది



చినగంజాం: ప్రతిజ్ఞ చేస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, బాలికలు



ద్రోణాదులలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పద్మ



యద్దనపూడి: సమావేశంలో మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్



ఆలస్యంగా చెన్నై వైపు వెళ్తున్న పినాకినీ సూపర్ ఫాస్ట్ రైలు

మంచు దుప్పటి

చీరాల టౌన్: పట్టణాన్ని మంచు దుప్పటి కమ్మేస్తోంది. ఉదయం 9 గంటలు దాటిన తర్వాత సూర్యుడు బయటకు వస్తున్నాడు. ఉదయం 9 గంటలు దాటిన తర్వాతనే మంచు వదులుతోంది. పాసింజర్లు, పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు సిగ్నల్ సక్రమంగా కనిపించక ఆలస్యంగా నడుస్తున్నాయి.



ఉదయం 8.30 గంటల సమయంలో ట్రాక్ కూడా కనిపించకుండా..



దట్టమైన మంచులో వాహనాల లైట్లు వేసుకుని వెళుతున్న ప్రజలు